# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 01 సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- గ్లోబల్ సమ్మిట్ కు పకడ్బందీగా ఏర్పాట్లు.
- పజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు మిగతా 2లో..

## ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 31:** కృష్ణా జలాలలను ఏపి తరలించుకు పోతున్నా ఇంకెప్పుడు మేల్కొంటారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నెటటెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్ రావు అన్నారు.

## తెలంగాణ కోసం కష్టపడ్డ తననే గెంటేశారు



- శకుని పాత్ర పోషించిన వేముల ప్రశాంతరెడ్డి
- జీవితంలోల ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
- కాంగ్రెస్ అధికారంలోకి రాగేనే కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం
- నాలుగేళ్లు ఇడి, సిబిఐ కేసలుతో జైలులో పెట్టారు
- నిప్పలా తిరిగి వచ్చానని భావోద్వేగానికి గురి
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు మిగతా 2లో..

# పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ

- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- అంబర్‌పేట సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. మిగతా 3లో..

## యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం



- బిజెపి కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

వివరాలు 2లో..

## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

- ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక ఒప్పందాలు
- 'తెలంగాణ రైజింగ్'కు మరో ముందడుగు



**హైదరాబాద్, ఆగస్టు 31:** హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్, అమెరికాలో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చ లు జరిగాయి. పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీ ఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్–ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది. ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్? భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్) ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో మిగతా 3లో..

## ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్ అభివృద్ధి



### శాతవాహన వసతి గృహాలకు మంత్రి పొన్నం శంకుస్థాపన

**సిద్ధిపేట,ఆగస్ట్31 :** సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దన్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ సమీపం ఉమాపూర్‌లోని శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి సుమారు రూ. 15 కోట్లతో నిర్మించనున్న వసతి గృహ భవనాలకు సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభించిన ఈ కళాశాలలో ప్రవేశాల సంఖ్య 175కు పెరిగిందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను తీసుకొస్తానన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. హుస్నాబాద్లో ఇంజినీరింగ్ కళాశాల మండలంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. చిగురుమామిడి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, సైదాపూర్ మండలంలో అదనంగా మరో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం చెప్పారు. భీమదేవరపల్లి మండలంలో నవోదయ పాఠశాల ఎల్కతుర్తి మండలంలో త్రిపుల్ ఐటీ బ్రాంచ్ రాబోతున్నాయన్నారు. హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ, మరో స్టేడియాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని, రేపటి భవిష్యత్తులో మంచి మిగతా 3లో..

## తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు

- మహబూబ్‌నగర్‌లో ఆధునీకరణ పనులు పరిశీలించిన కిషన్ రెడ్డి





**మహబూబ్‌నగర్,ఆగస్ట్31 :** తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకిత భావంతో తాము పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ను రైల్వేహాబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేంద్రప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛ స్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఎయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి మిగతా 3లో..

## ధరణి కన్నా దరిద్రంగా భూభారతి

- 22ఎతో ప్రజలను కాల్చుకు తింటున్నారు
- ఇబ్బంది పడుతున్న దాదాపు 50 లక్షల మంది
- సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి ధర్నా

వివరాలు 3లో..



## శ్రీధర్ బాబుతో జర్మన్ ప్రతినిధి బృందం భేటీ

### సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం



**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో జర్మన్‌కు చెందిన జీఐబీఏ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రి చర్చించారు. సెమీ కండక్టర్ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. జర్మనీ కంపెనీలను ప్రోత్సహించాలని జీఐబీఏ ప్రతినిధులను మంత్రి కోరారు. తెలంగాణను సెమీ కండక్టర్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. 'తెలంగాణ?జర్మనీ' లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జర్మనీ, యూరప్ మార్కెట్లకు తెలంగాణ ఎగుమతులు సులభంగా చేరేలా ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, పెట్టుబడి ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి చెప్పారు. జర్మనీ టెక్నాలజీని తెలంగాణ టాలెంట్‌తో అనుసంధానిస్తామని వెల్లడించారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్?2026'పై జర్మనీ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్?2026 నిర్వహిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు

- త్వరలో జిల్లాలకు సేవల విస్తరణ
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

వివరాలు 2లో..



## దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సమావేశ సంజయ్ జాజు సమావేశం



- రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులు
- 2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు డీపీఆర్‌లు

వివరాలు 3లో..

# అందుబాటులోకి మూసారాంబాగ్ బ్రిడ్జ్



- ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్31 : మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సోమవారం ప్రారంభోత్సవం చేశారు. మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు. ఈ బ్రిడ్జితో అంబర్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాలకు ప్రయాణాలు సులభం కానున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, శ్రీ గణేశ్, నవీన్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే ప్రయాణం సులువయ్యింది. ఇప్పటి వరకు గోల్‌నాక మీదుగా తిరిగి వెళ్లాల్సి వచ్చేది.

# ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- గ్లోబల్ సమ్మిట్ కు పకడ్బందీగా ఏర్పాట్లు.
- పజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు





హైదరాబాద్,ఆగస్ట్31: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో వచ్చే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రజా ప్రభుత్వం నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -2026 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు, ఐటీ?పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని ఈ వార్‌రూమ్ ద్వారా మరింత బలోపేతం చేయాలని అన్నారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్ల కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కమిటీకి సీనియర్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. అడ్వైజరీ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, హాస్పిటాలిటీ కమిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్ కమిటీ, మీడియా?కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్ కమిటీ, ఎంఓయూ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి , వారితో సమావేశాలు నిర్వహించి సమ్మిట్ కార్యాచరణపై చర్చించాలని తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వివరించేలా కార్యక్రమ రూపకల్పన ఉండాలని సూచించారు. సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో దేశ రాజధాని ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు తీరు, పెండింగ్ అంశాలు, తీసుకోవాల్సిన తదుపరి చర్యలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ప్రపంచానికి పరిచయం చేసేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?2026ను నిర్వహించాలని, ఇందుకోసం ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎ÷-లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటి సిఎండి శశాంక, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ కోసం కష్టపడ్డ తననే గెంటేశారు

- శకుని పాత్ర పోషించిన వేముల ప్రశాంతరెడ్డి
- జీవితంలోల ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
- కాంగ్రెస్ అధికారంలోకి రాగేనే కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం
- నాలుగేళ్లు ఇడి, సిబిఐ కేసులతో జైలులో పెట్టారు
- నిప్పులా తిరిగి వచ్చాని భావోద్వేగానికి గురి
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు



నిజామాబాద్,ఆగస్ట్31 : తెలంగాణ కోసం కష్టపడ్డ తనను అన్యాయంగా బయటకు గెంటేశారని, ఎంతో కష్టపడి పార్టీ అధికారంలోకి వచ్చేలా చేసిన సొంత పార్టీలోనే నాకు స్థానం లేకుండా పోయిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పు చేయకున్నా తిహార్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని ఆమె దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారని ఆరోపించారు. ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహాడ్ జైలులో పెట్టారు? నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు? తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు. కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు అని కవిత చెప్పారు. ఈ గడ్డ బిడ్డగా ఇక్కడ మిమ్ములను చూడగానే భావోద్వేగంతో కన్నీళ్లు ఆగడం లేదన్నారు. కేసీఆర్ పెద్ద కొడుకుగా ప్రశాంత్ రెడ్డి చెప్పుకుంటారని.. కానీ, మహాభారతంలో శకుని వంటి వ్యక్తి ఆయనని మండిపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిందేనని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పని చేశా. నాకు మళ్లీ ఒక అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం' అని కవిత అన్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే తాను ఎక్కడికైనా, ఏ పార్టీలోకైనా వెళ్లగలనని, కానీ ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఎన్ని కేసులు పెట్టినా నేను తప్పు చేయలేదనే చెప్పా. నన్ను తీహార్ జైలులో ఎందుకు పెట్టారు?' అని కవిత ప్రశ్నించారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు కనికరం చూపకుండా పార్టీ నుంచి వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే బాధతో కన్నీళు వస్తున్నాయని అన్నారు. తనను పిరికిదాన్ని అనుకోవద్దని హెచ్చరించారు. జైలులో ఉన్న సమయంలో తన అత్తగారు అండగా నిలిచారని కవిత గుర్తు చేసుకున్నారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరు అందలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, అప్పటి ఎమ్మెల్యేల ఆస్తులు పదేళ్లలో భారీగా పెరిగాయని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చేసిందేమీ లేదని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం నిద్రపోతోందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాల్లో తెలంగాణ రక్షణ సేన విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి రూ.2లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, అందులో రూ.లక్ష కోట్లు కేటాయిస్తే ఉచిత విద్య, వైద్యం అమలు చేయవచ్చని అన్నారు. సామాజిక న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తమ కార్యకర్తలను బెదిరించే రోజులు పోయాయని కవిత చెప్పుకొచ్చారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడైన కోరుట్ల ఎమ్మెల్యే కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా విమర్శలు గుప్పించారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అర్వింద్ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమవుతున్నాయని అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తికి ప్రజలు అవకాశం ఇవ్వాలని కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు.

# యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం

- బిజెపి కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్,ఆగస్ట్31: హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ ఆఫీస్‌పై చేసిన దాడిపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి ఆరా తీశారు. బీజేపీ ఆఫీస్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం చేసి, కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ÷ర్ అయ్యారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరారు. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# 'కెరీర్ ముసుగులో కుటుంబ వ్యవస్థను నాశనం చేసుకోవద్దు

- కుటుంబ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
- విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సంఘటన మహామంత్రి గుమ్మల్ల సత్యం




హైదరాబాద్, ఆగస్టు 31: ఆధునిక జీవన విధానం, కెరీర్ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి పేరుతో కుటుంబ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల క్షేత్ర సంఘటన మహామంత్రి గుమ్మల్ల సత్యం జీ హెచ్చరించారు. కెరీర్ ఎంత ముఖ్యమో కుటుంబం కూడా అంతే ముఖ్యమని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబం, సమాజం పట్ల బాధ్యతను యువత గుర్తించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని విశ్వహిందూ పరిషత్ బాధ్యతాయుతమైన కార్యకర్తల సమావేశం భాగ్యనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ సమాజం ఎదుర్కొంటున్న సామాజిక సవాళ్లు, కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, యువత భద్రత, జనాభా సమతుల్యత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా గుమ్మల్ల సత్యం జీ మాట్లాడుతూ.. "కెరీర్ కోసం కుటుంబాన్ని వాయిదా వేస్తూ పోతే ఒక దశలో కుటుంబమే లేకుండా పోయే పరిస్థితి వస్తుంది. ఆస్తులు సంపాదించడం మాత్రమే జీవిత లక్ష్యం కాదు. విలువలతో కూడిన కుటుంబాన్ని నిర్మించడం, పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం కూడా ప్రతి వ్యక్తి బాధ్యత" అని అన్నారు. యువత సరైన సమయంలో వివాహం చేసుకొని కుటుంబ జీవితానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కుటుంబ వ్యవస్థ బలహీనపడితే దాని ప్రభావం వ్యక్తిపైనే కాకుండా మొత్తం సమాజంపై పడుతుందని పేర్కొన్నారు. జనాభా సమతుల్యతపై సమాజంలో చైతన్యం అవసరమని, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కుటుంబం తమ పరిస్థితులు, సామర్థ్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. 'మహిళలు, యువతకు ఎదురవుతున్న సామాజిక సమస్యలపై అవగాహన పెంచడం, కుటుంబ వ్యవస్థను పరిరక్షించడం వంటి అంశాలపై విశ్వహిందూ పరిషత్ మరింత విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. "బలమైన కుటుంబం ? బలమైన సమాజం ? బలమైన దేశం" అనే ఆలోచనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్‌ను గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయడం, హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించడం, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడం, రాబోయే కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహామూర్తి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీత రెడ్డి, రాష్ట్ర సహ కార్యదర్శులు చింతల వెంకన్న, రమేష్, ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్, గోరక్ష, దుర్గా వాహిని, పలు విభాగాల రాష్ట్ర కన్వీనర్లు, ముఖ్య బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రేట్ మహానగరి జిల్లాలు

- హైదరాబాద్ • మేడ్చల్- రంగారెడ్డి

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు

హైదరాబాద్,ఆగస్ట్31 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆయా జిల్లాలకూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలు విస్తరించాలని అధికారు లను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యశాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో ఏఆర్టీ, సరోగసీ చట్టాల అమలుపై కఠిన నిఘా ఉంచుతున్నట్లు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సెంటర్లను ఉపేక్షించబోమని హెచ్చరించారు. తెలంగాణలో 477 ఏఆర్టీ, సరోగసీ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించు కున్నట్లు మంత్రి దామోదర వెల్లడించారు. 379 ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేశామని చెప్పారు. 50 చోట్ల డీవియేషన్స్ గుర్తించామని తెలిపారు. 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేశామని.. 9 సెంటర్ల అనుమతులు తాత్కాలికంగా రద్దు చేశామని చెప్పుకొచ్చారు. ఫెర్టిలిటీ సేవల పేరుతో రోగులపై అనవసర ఆర్థిక భారం వద్దని అన్నారు. గాంధీ, పేట్లబురుజు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరుపై మంత్రి సమీక్షించారు. రెండు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్లలో 39,802 మందికి ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్లు మంత్రి దామోదర తెలిపారు. 545 ఐవీఎఫ్ కేసులు, 521 ఐయూఐ పక్రియలు పూర్తి చేసినట్లు వివరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నుంచి జులై మధ్యలో హాస్పిటళ్లు, స్కానింగ్ సెంటర్లలో 2,600 తనిఖీలు నిర్వహించామని తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# పాలకవర్గాలకు నామినేషన్లు వద్దు.. ఎన్నికలే ముద్దు..

## జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి రైతుల విజ్ఞప్తి..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (PACS) పాలకవర్గాలను నామినేషన్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ద్వారా ఏర్పాటు చేయాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ ాూజుల రైతు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సహకార వ్యవస్థలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని వారు కోరారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ాూజూ) పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఇప్పటికే ఏడాదికి పైగా గడిచిందని రైతులు పేర్కొన్నారు. పదవీకాలం పూర్తయినప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలాన్ని ఇప్పటికే రెండుసార్లు పొడిగించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.సహకార సంఘాలు రైతుల ఆర్థిక, వ్యవసాయ అవసరాలకు సంబంధించిన కీలకమైన సంస్థలని, వాటి నిర్వహణలో సభ్య రైతుల భాగస్వామ్యం, ఆమోదం, ప్రజాస్వామ్య పద్ధతులు అత్యంత ముఖ్యమని రైతులు తెలిపారు. పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ఎన్నికలు నిర్వహించకుండా పాలకవర్గాలను కొనసాగించడం వల్ల సహకార సంఘాలపై సభ్య రైతుల విశ్వాసం దెబ్బతినే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.తెలంగాణ సహకార చట్టం, 1964లోని నిబంధనల ప్రకారం సహకార సంఘాల నిర్వహణలో ప్రజాస్వామ్య పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని రైతులు గుర్తుచేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నియమించిన వైద్యనాథన్ కమిషన్ సహకార రంగంపై చేసిన సిఫారసుల్లో కూడా ప్రభుత్వ జోక్యం పరిమితంగా ఉండాలని, సహకార సంఘాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, పదవీకాలం పూర్తయిన అనంతరం సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించిన విషయాన్ని వారు ప్రస్తావించారు.పాలకవర్గం పదవీకాలం ముగియడానికి ముందుగానే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి, పదవీకాలం పూర్తయ్యే సమయానికి కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం అందుకు విరుద్ధంగా పరిస్థితులు కొనసాగుతున్నాయని రైతులు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలు నిర్వహించకుండా, రైతు సభ్యుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నామినేషన్ పద్ధతి ద్వారా కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారుాూజూలు స్వయంప్రతిపత్తి కలిగిన సహకార సంస్థలని, వాటి పాలకవర్గాలను సభ్య రైతులే ఎన్నుకోవడం సహకార స్ఫూర్తికి అనుగుణమైన విధానమని రైతులు స్పష్టం చేశారు. సభ్య రైతుల సమ్మతి లేకుండా నామినేషన్ పద్ధతిలో పాలకవర్గాలను నియమించడం వల్ల సహకార సంఘాల స్వయం ప్రతిపత్తి, ప్రజాస్వామ్య స్వభావం దెబ్బతినే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ సహకార చట్టం, 1964లోని సెక్షన్ 115ఐ(3)తో పాటు సహకార రంగానికి సంబంధించిన నిబంధనలు, స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని ాూజూల నిర్వహణలో ప్రజాస్వామ్య విధానాలను కొనసాగించాలని వారు కోరారు.దేశంలోని పలు రాష్ట్రాల్లో అధికారంలో ఒకే రాజకీయ పార్టీ ఉన్నప్పటికీ, అక్కడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలను ఎన్నికల ద్వారానే ఏర్పాటు చేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కూడా సహకార సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న విషయాన్ని వారు ప్రస్తావించారు.నామినేషన్ విధానమే సమర్థవంతమైన పద్ధతి అయితే, ఆయా రాష్ట్రాల్లో కూడా ప్రభుత్వాలు అదే విధానాన్ని అనుసరించవచ్చని, కానీ సహకార సంస్థల్లో సభ్య రైతులే తమ ప్రతినిధులను ఎన్నుకునే విధానానికి ప్రాధాన్యం ఇస్తున్నారని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 908 PACSలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు. నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదనలు లేదా చర్యలు ఉంటే వాటిని నిలిపివేసి, సహకార సంఘాల సభ్య రైతులకు తమ ప్రతినిధులను స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశం కల్పించాలని కోరారు.ప్రజల చేత, ముఖ్యంగా రైతు సభ్యుల చేత ఎన్నుకోబడిన పాలకవర్గాలñ PACSల అభివృద్ధికి, పారదర్శకమైన పాలనకు, సభ్య రైతుల ప్రయోజనాల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయగలవని వారు అన్నారు.జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్రవ్యాప్తంగా ాూజూ ఎన్నికలను త్వరితగతిన నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ

రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సిఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు.కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధ రించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.

## ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్ అభివృద్ధి

ప్లేస్మెంట్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి, పుర అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు

నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బు÷-లలెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బు÷-లలెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్టను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి. ÷-రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఓఎ÷), లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. ÷-రిటన్, అమెరికా పర్యటన ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను త్రి-ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మా లక్ష్యానికి ఈ పర్యటన పెద్ద బలం ఇచ్చింది. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న మధ్యంతర లక్ష్యానికీ ఇది ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలతో ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు కుదరడం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. తెలంగాణ యువత, పిల్లలకే కాకుండా దేశంలోని విద్యా ర్థులకు కూడా ప్రపంచస్థాయి విద్య అందేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు నేనే నాయకత్వం వహిస్తాను‘ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపం చంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదివి యువత ప్రపంచస్థాయిలో మంచి నిపుణులుగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని సాధించడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మెరికా పర్యటనలో తెలంగాణ బృందం నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధులతో సమావేశమైంది.

# నర్స్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

### అత్యాచారం జరిగినట్లు పోస్ట్ మార్టమ్ నివేదిక వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 31: తుక్కుగూడ నర్సు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నర్స్‌పై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. నిందితుడు సనావుల్లా కూడా అత్యాచారం చేసినట్టు అంగీకరించాడు. దీంతో పోలీసులు రేప్ సెక్షన్ కింద కేసును నమోదు చేయనున్నారు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి శనివారం అనుమానాస్పద స్థితిలో మరణించిన విషయం తెలిసిందే. రాఖీ పండగ సందర్భంగా తోటి నర్సులందరూ స్వగ్రామాలకు వెళ్లగా.. హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న యువతి హత్యకు గురైంది. దీంతో పహాడీ షరీఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి.. ఆసుపత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పని చేస్తున్న సనావుల్లా ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. కిటికీ నుంచి నిందితుడు హాస్టల్‌లోకి ప్రవేశించినట్టు తెలుస్తోంది. అత్యాచారాన్ని నర్సు అడ్డుకోవడంతో.. సనావుల్లా ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి హత్య కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల ఆధారంగా బిహార్‌కు చెందిన సనావుల్లా ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆస్పత్రి సమీపంలోని మెకానిక్ షాపులో పనిచేస్తున్న అతడే ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. శిరీష ఉంటున్న గది కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో అదే మార్గం ద్వారా సనావుల్లా లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. అయితే శిరీష నిందితుడిని ప్రతిఘటించి కేకలు వేయడంతో ఆమె అరుపులు బయటకు వినిపించకుండా చేసేందుకు గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మెకానిక్ షాపు యజమానికి ఫోన్ చేసిన సనావుల్లా.. తనకు పెట్రోల్ కావాలని అడిగినట్లు పోలీసులు గుర్తించారు. హత్య విషయం బయటకు రాకముందే అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు అతడు ప్రయత్నించినట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు శిరీష మృతదేహం బయటపడిన తర్వాత పోలీసులు ఘటనాస్థలంలో దర్యాప్తు ప్రారంభించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలోనూ సనావుల్లా అక్కడే ఉన్నాడు కూడా.. అంతేకాదు, పోలీసులను అక్కడ ఏం జరిగిందని ప్రశ్నించడం కోసమెరుపు. అయితే తనిఖీల్లో భాగంగా.. జాగిలం మెకానిక్ షాపు వద్దకు వచ్చి ఆగడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. దీంతో సనావుల్లాను అదుపులోకి తీసుకుని విచారించారు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం అతడిని ప్రశ్నించగా చివరకు హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో అతడితో పాటు మరెవరైనా ఉన్నారా? హత్యకు ముందస్తు ప్రణాళిక ఉందా? అనే కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

# ధరణి కన్నా దరిద్రంగా భూభారతి

- 22ఎతో ప్రజలను కాల్చుకు తింటున్నారు
- ఇబ్బంది పడుతున్న దాదాపు 50 లక్షల మంది
- సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి ధర్నా



సిద్ధిపేట,ఆగస్ట్31 : భూమి వివరాల కోసం బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ఇంకా దరిద్రంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. 22 ఏ తో దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్థం లేని విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఒప్పుకున్నారని గుర్తు చేశారు. తప్పును మాత్రం సరిదిద్దుకోవడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు బీఆర్ ఎస్ అయినా.. నేడు కాంగ్రెస్ అయినా టైటిల్ మారింది తప్ప, దోపిడి విధానాలు మారలేదని వ్యంగ్యంగా అన్నారు. 03 సర్వే నెంబర్‌లో కేవలం రెండు ప్లాట్లు సమస్యల్లో ఉంటే వేలాది ఎ÷-లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని వివరించారు. అదే సర్వే నెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు మాత్రం 22 ఏ నుంచి బయటకు ఎలా వచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. పేదల భూములు గుంజుకుని ప్రభుత్వం అమ్ముకుంటున్నదని విమర్శించారు. మ భూములు కాపాడండంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. 22 ఏ నిషేధిత జాబితాపై శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 ఏపై స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రైతుల కోసం బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. వారి కోసం జైలుకైనా వెళ్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రారంభమయ్యే లోపు ప్రభుత్వం 22ఏ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీజేపీ చీఫ్ రామచందర్ రావు సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులకు, పేదలకు న్యాయం అన్నారని ఆ పార్టీ నేతలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. కానీ ఇప్పుడు పేదలు, రైతుల పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పయింది సరి చేస్తామన్నారని చెప్పారని.. కానీ పేదలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ÷ఔములు విక్రయిస్తేనే రాష్ట్రాభివృద్ధి అంటున్నారని రేవంత్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. భూమి విక్రయాలను గొప్పగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. 22 ఏ రైతుల భూమి మీద పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు కష్టం వస్తే తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. భూభారతి తెస్తే రైతు కష్టం తీరుతుందని చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు, రెవెన్యూ మంత్రి భూములు కూడా 22 ఏలో పడ్డాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తులు ఇప్పుడు ప్రజలకు చూపాలని డిమాండ్ చేశారు. గుంపు మేస్త్రి దరఖాస్తు బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. మీ భూములు ఏ దరఖాస్తులు లేకుండా 22 ఏలో నుంచి ఎలా తీసేస్తారని ఈ సందర్భంగా వారిని సూటిగా ప్రశ్నించారు. మరి రైతుల భూములు ఎందుకు తియడం లేదని వారిని సందేహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లాలో భూములు ఎవరికి తెలియకుండా మాయం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేరిట, ప్రాజెక్టుల పేరిట భూములు లాక్కున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇక్కడి భూములు విక్రయించి.. ఆ సూట్ కేసులు ఢిల్లీకి మోస్తున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకో ఏడాది అయితే కాంగ్రెస్‌లో కార్యకర్తలు ఎవ్వరు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భూములు నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్‌ను నిషేధించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ లోగా 22 ఏ జీవో తొలగించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు.

# దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సమావేశ సంజయ్ జాజు సమావేశం

- రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులు
- 2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు డీపీఆర్‌లు
- రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎస్ సమీక్ష



హైదరాబాద్, ఆగస్టు 31: రాష్ట్రంలో పురో గతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారు లను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాల యంలో రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవా స్తవ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్ తదితర ఉన్నతాధి కారు లతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. సందర్భంగా రాష్ట్రంలో రైల్వే ప్రాజె క్టుల పురోగతి, ప్రాజెక్టుల అమలులో ఎదుర వుతున్న సమస్యలు, భూసేకరణ, వివిధ శాఖల నుంచి అవసరమైన పరిపాలనా అనుమతులు, రైల్వే ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన సహాయ సహకారాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. రైల్వే కనెక్టివిటీ రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, ప్రాంతీయ అభివృద్ధికి అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పెండింగ్ అం శాలను వేగంగా పరిష్కరించి, రైల్వే ప్రాజెక్టు ల పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను, జిల్లా కలెక్టర్లను ఆదే శిం చారు. రాష్ట్రంలో సుమారు రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టు లకు సంబంధించి 2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌లను రైల్వే బోర్డుకు సమర్పించినట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు అండర్‌పాస్ లు, రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, వివిధ రైల్వే మార్గాల డబ్లింగ్ పను లు, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రజా రవాణా సదుపాయాల మెరుగుదల తదితర సుమారు 21 అంశాలపై సమావేశంలో సమీక్షిం చారు. పెండింగ్ అంశాల పరిష్కారానికి సంబం ధిత శాఖల ఉన్నతాధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించి, సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను గుర్తించాలని సీఎస్ ఆదేశించారు. ÷బిరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు తగు ప్రణాళికలను సిద్ధం చేయాలని, ప్రధానంగా మున్సిపల్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు-భవనాల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైల్వే ప్రాజెక్టుల అమలులో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని, అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని సీఎస్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పీఎం గతిశక్తి పథకం కింద నిధులు పొందేందుకు అవసరమైన సమగ్ర డీపీఆర్‌లను సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. అలాగే ఎంఎంటీఎస్ విస్తరణ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మహానగర పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో టెర్మినల్స్ ఏర్పాటు, భవిష్యత్ రైల్వే కనెక్టివిటీతో పాటు బు÷-లలెట్ ట్రైన్ మార్గాలకు అవసరమైన భూసేకరణ తదితర అంశాలపై సమగ్ర డీపీఆర్‌లను సిద్ధం చేయాలని రైల్వే అధికారులకు సూచించారు

# తెలంగాణ

## ప్రశ్నార్థకంగా ఆడబిడ్డల భద్రత

### తుక్కుగూడ ఘటనే ఇందుకు నిదర్శనం

### మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్, ఆగస్టు 31: తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తుక్కుగూడలో నర్స్ హత్య ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పాల నలో ప్రజల ఆస్తులకే కాదని.. ప్రజల ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనంతరం అత్యాచారం జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకాలు పెరిగి, శాంతిభద్రతలు క్షీణిస్తున్నా యని, ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా మారుతుంటే ఏం చేస్తున్నారని నిలదీ శారు. ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుందని హరీశ్ ప్రశ్నించారు. 'మహిళలకు భద్రత కల్పించలేని మీకు హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా? ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చేయాలి. రాష్ట్రంలో దిగజారుతున్న మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఃఖా పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

## చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య



హైదరాబాద్, ఆగస్టు 31: నగరంలోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## వచ్చే మార్చి నాటికి లక్ష ఉద్యోగాల భర్తీ

### రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి వెల్లడి

మహబూబాబాద్,ఆగస్ట్31 : వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రకటి ంచారు. అలాగే వారానికి ఒక ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిరుద్యోగులకు వరుసగా అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. మానుకోటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణ శిబిరంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే డిసెంబర్‌లో మరోసారి పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీని మూడు విడతల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించడంలో వెనుకంజలో ఉందని వేం నరేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమవాళ్లు కొంత వెనుకబడ్డారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించిన అనేక ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. చివరకు జిరాక్స్ సెంటర్లలో కూడా ప్రశ్నపత్రాలు లభించే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతం ఉద్యోగ నియామక పక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## అర్ధరాత్రి అగ్నిప్రమాదం

### ఐదు టూవీలర్లు దగ్ధం

రంగారెడ్డి,ఆగస్ట్31: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌షాకోట్ డివిజన్ సాయిరాం నగర్ కాలనీలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభ వించింది. ఇంట్లో పార్క్ చేసిన బైక్‌లకు ఒక్కసారిగా మంటలు వ్యాపిం చాయి. దీంతో ఐదు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బైక్‌లలో పెట్రోల్ ఉండటంతో భారీగా మంటలు భారీ ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బైక్‌లకు ఎవరైనాకావాలనే నిప్పంటించారా? అనే అనుమానాలు వ్యక్త మవుతు న్నాయి.సోమవారం)తెల్లవారుజామున3.30గంటల సమయం లో గుర్తుతెలియని వ్యక్తి సంచరించినట్లు పోలీసులు సీసీ ఫుటేజ్‌లో గుర్తిం చారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయా? లేక ఉద్దేశ పూర్వ కంగానిప్పంటించారా?అనేకోణంలోపోలీసులుదర్యాప్తు చేపట్టారు.

# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- 2028లో రెండోదశ పూర్తి...మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
- మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం





మార్కాపురం, ఆగస్టు 31 ; మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు.

### 30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం

వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.

## జాతీయం-అంతర్జాతీయ

## విశాఖలో ఏఐజి ఆస్పత్రి నిర్మాణం

- 2వేల కోట్ల పెట్టుబడితో 9వేల మందికి ఉపాధి
- శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్
- ఆలిండియా రేడియో సెంటర్‌లో రోశయ్య విగ్రహావిష్కరణ

విశాఖపట్నం,ఆగస్ట్31 : ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ 8వ వార్డులోని ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు. విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది. అంతకుముందు మాజీ సిఎం రోశయ్య విగ్రహాన్ని లోకేశ్ ఆవిష్కరించారు. దివంగత మాజీ గవర్నర్, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని ఆలిండియా రేడియో జంక్షన్‌లో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి టీజీ భరత్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వంశీ, విష్ణు కుమార్ రాజు, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రోశయ్యను స్టాట్యూ ఆఫ్ స్టేట్స్ మాన్‌గా నామకరణం చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. తమలాంటి యువతకు రోశయ్య ఆదర్శమని పేర్కొన్నారు. రోశయ్య లాంటి రాజకీయాలకు తమ తరం దూరమైందని బాధపడుతున్నానని తెలిపారు. తమ తరం రాజకీయాల్లో మార్పు రావాలని చెప్పారు. ఆయన అన్ని పదవుల్లో పనిచేశారని.. తెలుగు జాతి కోసం ఆలోచించారని కొనియాడారు. రోశయ్య గురించి పుస్తకాలు రాయాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఓ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చివరి వరకు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. అలాంటి కమిట్‌మెంట్ యువతలో ఉండాలని, ప్రతి ఒక్కరిలో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

## వెలిగొండతో కరువు ప్రాంత రైతులకు కొత్త వెలుగు

### సాగు,తాగునీరు, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అధ్యాయం

### వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు

అమరావతి,ఆగస్ట్31 : వెలిగొండ ప్రాజెక్టుతో కరువు ప్రాంత రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. రైతుల ఆశలు, ప్రజల ఆకాంక్షలను నిజం చేస్తున్న ప్రాజెక్టు వెలిగొండ అని అన్నారు. సాగునీరు, తాగునీరు, ఉపాధి, ప్రాంతీయ అభివృద్ధికి వెలిగొండ కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. వెలిగొండ ప్రారంభోత్సవం కేవలం ఒక ప్రాజెక్టు ప్రారంభం కాదు.. కరువు సీమ భవిష్యత్తును మార్చే చారిత్రక ఘట్టమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాకారం చేశారని తెలిపారు. 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఆయన చేతుల మీదుగానే ఈ ప్రాజెక్టు జాతికి అంకితం కావడం చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేయడంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారనేందుకు వెలిగొండ నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మహత్తర ప్రాజెక్టు ఇది అని తెలిపారు. కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో లక్షలాది మందికి తాగునీటి భరోసా కల్పించే ప్రాజెక్టు ఇదని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల రైతులకు వెలిగొండ వర ప్రదాయిని అని వివరించారు. కృష్ణా వరద జలాలను కరువు నేలకు మళ్లించడం ద్వారా రైతుల పొలాలకు జీవం పోస్తున్నామని అన్నారు. వెలిగొండతో చెరువులు నిండుతాయని.. భూగర్భ జలాలు పెరుగుతాయని.. వ్యవసాయానికి కొత్త ఊపు వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు ధీమా వ్యక్తం చేశారు. కరువు కారణంగా జరిగే వలసలకు శాశ్వత పరిష్కారం చూపే జీవనరేఖ వెలిగొండ ప్రాజెక్టు అని ఆయన చెప్పారు. నిర్వాసిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. 48 రోజుల్లోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.762 కోట్ల పరిహారం అందించడం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కరవు నేలకు కృష్ణా జలాలు తెచ్చిన అపర భగీరథుడు సీఎం చంద్రబాబు నాయుడు అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖపట్నంలో తెలిపారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం.. సీఎం చంద్రబాబు సంకల్పానికి నిదర్శనమని అన్నారు. 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ కల సాకారం అవుతోందని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం చారిత్రాత్మక ఘట్టం అని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఈ ప్రాజెక్ట్ పూర్తయిందన్నారు.వెలిగొండ ప్రాజెక్టుతో కరువు ప్రాంతాల్లో రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరాంధ్ర రైతులకు ఎంతో మేలు జరుగుతోందని అన్నారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా హోం మంత్రి అనిత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దశాబ్దాల కల నెరవేరిన తరుణమిది

### వెలంగొండ ప్రారంభంపై ఎక్స్ వేదికగా పవన్ హర్షం



అమరావతి,ఆగస్ట్31 : దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ కృష్ణా జలాలు కరవు పీడిత ప్రాంతాలకు చేరనున్న ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం కావడం మార్కాపురం, ప్రకాశం, కడప, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల ప్రజలకు ఎనలేని సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు తొలి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడానికి మూడు దశాబ్దాలుగా కృషి చేసిన ఇంజినీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, ప్రజా సంస్థలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం 7,300 మందికి పైగా తమ ఇళ్లు.. భూములు కోల్పోయి నిర్వాసితులుగా మిగిలారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం రూ.905 కోట్లు విడుదల చేయగా.. ఇప్పటికే రూ.768 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. 1996లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని.. నేడు ఆయన నాయకత్వంలోనే తొలి దశ ప్రారంభం అవుతోందని పవన్ గుర్తుచేశారు. చంద్రబాబు దూరదృష్టి, సంకల్పం కరవు ప్రాంతాల్లో జల సిరులు పారించనుందని పేర్కొన్నారు. మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో జల్ జీవన్ మిషన్?అమరజీవి జలధార కింద చేపడుతున్న మెగా వాటర్ గ్రిడ్ పథకానికి వెలిగొండ ప్రధాన నీటి వనరుగా నిలవనుందని తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్ప సాధనలోనూ ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ.. ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేసిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

- రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి
- పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు



మంగళగిరి, ఆగస్టు 31 : రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రకటన విడుదలయ్యింది. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు.అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్‌లు) కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పిలుపునిచ్చారు.

## వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి"





అమరావతి, 2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు. మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలువెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

## వెలిగొండ పేరుతో జగన్ మోసం

- పూర్తికాకుండానే జాతికి అంకితం చేయడం దుర్మార్గం
- ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి



మార్కాపురం,ఆగస్ట్31 : వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశానంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి మోసం చేశారంటూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ వేదికపై జగన్‌పై ఎంపీ విరుచుకు పడ్డారు. జగన్ ఓ మూర్ఖుడంటూ వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం జరిగిన తీరు చూస్తుంటే భావోద్వేగంతో కళ్ల వెంబడి నీళ్లు తిరుగుతున్నాయన్నారు. మార్కాపురం ప్రజలు, రైతులకు మేలు చేసేలా వెలిగొండ ప్రాజెక్ట్‌ను సీఎం చంద్రబాబు పూర్తి చేశారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం సాయం అందించిందని చెప్పారు. కులపోడని 2019 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకున్నామని.. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశానంటూ ఇక్కడి ప్రజలను మోసం చేశారంటూ విరుచుకుపడ్డారు. మార్కాపురం జిల్లా ప్రజలకు ఇంత మేలు చేసిన చంద్రబాబుకు అండగా నిలుద్దామని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. రూ.4 వేల కోట్ల పనులను పెండింగ్‌లో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేసిన సిగ్గులేని గొడ్డలి పార్టీని ఏమనాలని ప్రశ్నించారు. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజలను, రైతులను మోసం చేసిన వ్యక్తులను ఏం చేయాలన్ని ÷ర్ అయ్యారు. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పు కుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్ట్ నుంచి నీళ్లు ఎందుకివ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. వారి హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కుపోయిందని.. సొరంగం పనులు పూర్తి కాలేదని చెప్పారు. ఈ సమస్యలను తాము పరిష్కరించి, వెలిగొండ పనులు పూర్తి చేసి ఇప్పుడు నీళ్లు ఇచ్చామని వెల్లడించారు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తులను, మోసం చేసిన వారిని గుర్తించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలని అన్నారు. ఈ ప్రాజెక్ట్ పనులు తామే పూర్తి చేశామని ఆ పార్టీ నేతలు ఇప్పుడు బుకాయిస్తు న్నారని ధ్వజమెత్తారు. ఇంకా రూ.1900 కోట్ల పనులు మిగిలి ఉన్నాయని.. వీటిని పూర్తి చేస్తే మొత్తం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అవుతుందని స్పష్టం చేశారు.

## జగన్ రాకతో వెలిగొండకు గ్రహణం

### కూటమి వచ్చాకే పనులు పూర్తి

### జలవనరుల మంత్రి నిమ్మల విమర్శలు

మార్కాపురం,ఆగస్ట్31 : వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్వాకాలను మంత్రి నిమ్మల రామానాయుడు కడిగిపారేశారు. వెలిగొండ పేరుతో జగన్ చేసిన మోసాన్ని సభలో ఆసాంతం వివరించారు. 2019-2024 మధ్య కాలంలో వెలిగొండ పేరుతో చేసిన దుర్మార్గాలను ఎండగట్టారు. టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ మిషన్ తీయడానికి కనీస ప్రయత్నం చేయకుండానే.. రూ.2 వేల కోట్లకు పైగా పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితమంటూ ఆనాడు జగన్ డ్రామాలాడారంటూ విరుచుకుపడ్డారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న చర్యలు.. నిర్వాసితుల విషయంలో చంద్రబాబు పెద్ద మనస్సుతో వ్యవహరించారంటూ గత రెండేళ్ల కాలంలో జరిగిన పరిణామాలను మంత్రి వివరించారు. నాడు జగన్ ఇంకా పూర్తిగా తవ్వని సొరంగంలో కార్పెట్ వేసుకుని నడిచి నకిలీ జాతికి అంకితం కార్యక్రమాన్ని చేపట్టారని మండిపడ్డారు. టన్నెళ్లల్లోకి కృష్ణా జలాలను పంపి నిజమైన జాతికి అంకితం కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు.

# వెయ్యి రోజుల ప్రజాపాలన.. సంక్షేమానికి పెద్దపీట



**-బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది..**
**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,వేములవాడ:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ అర్బన్, రూరల్ మండలాల నూతన కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని,ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎక్కడా నిలిపివేయకుండా అమలు చేస్తోందని అన్నారు . పేదలకు రేషన్ కార్డులు అందించడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని అన్నారు .ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, ఆ రెండు పార్టీలు ఒకే గూటికి చెందినవని, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తెలంగాణలో అమలవుతున్న పలు సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలు తెలంగాణలో అమలవుతున్న పథకాలను పరిశీలించి అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వేములవాడ నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## సంఘం అభివృద్ధికి సహకారం అందిస్తాం..



**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,వేములవాడ:**

వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న వేములవాడ మండల అరెకటిక సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, అరెకటిక సంక్షేమ సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సంఘాల అభివృద్ధి ద్వారా ఆయా వర్గాల ఐక్యత, సామాజిక పురోగతి మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు తోట రాజు, శేఖర్, శ్రీనివాస్, తూము మధు, నాయకులు కూరగాయల కొమురయ్య, ప్రసాద్, బుట్టి రమేష్, కొలకని రాజు, మల్లేశం, విష్ణు, సిరిగిరి శ్రీకాంత్, గుమ్మడి రాజేష్ గౌడ్, దూలం భూమేష్‌తో పాటు అరెకటిక సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బీ సీఈ కిషన్‌రావుకు ఘన సన్మానం...



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) చీఫ్ ఇంజనీర్ అంకేశారపు కిషన్‌రావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆర్‌అండ్‌బీ శాఖలో జేఈఈగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి 34 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సేవలందించి సీఈగా పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ జూపల్లి వెంకట్రావు, బలగం టీవీ సీఈవో బాలు కాయితి కిషన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు.కిషన్‌రావు గతంలో సిరిసిల్లలో ఆర్‌అండ్‌బీ డీఈఈగా విధులు నిర్వహించారు.

## పదేళ్లు హామీలు మరిచారు..
## ఇప్పుడు వెయ్యి రోజుల పాలనపై ఆందోళనా..?

**-బీఆర్ఎస్‌కు ప్రజల్లోకి వెళ్లే నైతిక హక్కు లేదు..**
**-డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉన్నదని డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు . సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలతో పాటు ప్రజలకు అవసరమైన పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు.ప్రజలు బీఆర్ఎస్ పాలనను తిరస్కరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పారని, ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల గురించి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందని అన్నారు.

2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, అర్హులైన ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిందనిఅన్నారు . నిరుద్యోగ భృతి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ప్రతి జిల్లాలో వంద పడకల ఆసుపత్రి, ఇంటింటికీ తాగునీరు, ముస్లింలు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రతి కుటుంబానికి ఉద్యోగం, రైతులకు రుణమాఫీ, పోడు భూములకు హక్కులు వంటి హామీలను అమలు చేయలేదనిఅన్నారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అణచివేసిందని, ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన ఘనత ఆ పార్టీదేనని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితుల నుంచి రాష్ట్ర పాలనను కాంగ్రెస్‌కు అప్పగించారని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు.

మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులకు రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.స్థలం ఉన్న అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, సిరిసిల్ల పట్టణంలోని ప్రతి వార్డులో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు .నిరుద్యోగులకు అండగా గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తూ ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువ వికాసం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరీక్ష పత్రాల లీకేజీలతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసి, వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేస్తోందని, ఇంకా రెండేళ్ల పాలన సమయం ఉన్నందున ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని అన్నారు .

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవద్దని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. పదేళ్ల పాలనలో హామీలను అమలు చేయలేకపోయిన బీఆర్ఎస్ నాయకులు ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు ఆకునూరు బాలరాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆడేపు చంద్రకళ, కౌన్సిలర్లు గంగరాజు, శ్రీశైలం, లీల, జిల్లా నాయకులు చొక్కల రాము, వేముల దామోదర్, బొప్ప దేవయ్య, నీలి రవీందర్, తుంగ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం

**-రోస్టర్ పాయింట్లు సవరించాలంటూ సచివాలయ ముట్టడి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ఎస్సీ వర్గీకరణ అమలులో మాల సామాజిక వర్గానికి విద్యా, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని, రోస్టర్ పాయింట్లను న్యాయబద్ధంగా సవరించాలని డిమాండ్ చేస్తూ మాల కుల నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించారు.శాంతియుతంగా నిరసన చేపట్టిన మాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో విద్యా, ఉద్యోగ నియామకాల్లో మాలలకు తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన, రాజ్యాంగబద్ధ హక్కులకు అనుగుణంగా మాలలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్లలో ఉన్న లోపాలను వెంటనే సవరించాలని కోరారు.ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు.మాలలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయం జరిగే వరకు, రోస్టర్ పాయింట్లలో జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం సవరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మాలల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాల కుల నాయకులు రెడ్డి మల్ల రాజనర్సు, నర్మల మాజీ సర్పంచ్, ఎడబోయిన రాజు, బండ రమేష్, దోశల ఉపేంద్ర, సుదర్శన్, జక్కుల నవీన్,పల్లటి దేవరాజు, పోతుల సాగర్, కొంపెల్లి ఆంజనేయులు , నరేష్, విష్ రాజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్ అమలు..

**-సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఆంక్షలు**
**– జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :**



జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్-1861 ప్రకారం ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని తెలిపారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడరాదని హెచ్చరించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.



## సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో సేవలందించడం అభినందయం...

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో అంకితభావంతో సేవలందించడం అభినందనీయమని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. 43 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహించి సోమవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ రవీందర్ నాయుడును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేష్ బి. గితే ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే

మాట్లాడుతూ ఎస్ఐ రవీందర్ నాయుడు 43 సంవత్సరాల పాటు అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో పోలీస్ శాఖలో సేవలందించారని అన్నారు. విధి నిర్వహణలో సమర్థత, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి, సహోద్యోగులతో సత్సంబంధాల ద్వారా శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చారనిఅన్నారు .ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా రవీందర్ నాయుడు ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.జిల్లాలో కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐగా రవీందర్ నాయుడు కీలక పాత్ర పోషించారని, వివిధ విభాగాలను సమన్వయం చేస్తూ కేసుల పురోగతిలో ఆయన సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రావణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు కాంగ్రెస్ నాయకుల సస్పెన్షన్

**-పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనపై చర్యలు.. మండల అధ్యక్షుడి ఉత్తర్వులు**

**బలగం టీవీ,ముస్తాబాద్:**

పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించారనే ఫిర్యాదులు, సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఇద్దరు కాంగ్రెస్ నాయకులపై క్రమశిక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆదేశాల మేరకు ముస్తాబాద్ మండల కాంగ్రెస్ కమిటీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.తోట ధర్మేందర్, జంగా రాజులను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు పార్టీ కార్యకలాపాల నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్జల రాజు తెలిపారు. పార్టీ నియమావళి ప్రకారం క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ సస్పెన్షన్ నిర్ణయం ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆమోదానికి లోబడి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## ఎడమల శ్రీధర్‌రెడ్డికి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ సత్కారం

**-ప్రజాసేవకు గౌరవ డాక్టరేట్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



ప్రజాసేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఎడమల శ్రీధర్‌రెడ్డికి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.పుదుచ్చేరిలోని కంబన్ కళైఅరంగం ఆడిటోరియంలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ జడ్జి డా. కె. వెంకటేశన్ అధ్యక్షత వహించారు. ప్రజాసేవా రంగంలో శ్రీధర్‌రెడ్డి చేసిన కృషిని గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందజేశారు.

మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ, తమిళనాడు ప్రభుత్వం పి.ఆర్. శంపత్ ఐఏఎస్, అంబాసిడర్ డా. పర్విందర్ సింగ్, అంతర్జాతీయ న్యాయవాది డా. కావేటి శ్రీనివాస్‌రావు, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి. అమృతవల్లి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కమిషనర్ డా. కె. సుకుమార, మద్రాస్ హైకోర్టు గౌరవ ఆర్బిట్రేటర్ డా. ఎస్. సిద్ధార్థన్, యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డా. తోడేటి శ్రీకాంత్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా శ్రీధర్‌రెడ్డి గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు.ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తన ప్రజాసేవను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించడం ఆనందంగా, మరింత బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఈ గౌరవం తనపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజాసేవకు అంకితమై మరింతగా పనిచేస్తానని పేర్కొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడు యేటల్లి విజయ్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ సోమవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా

ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ

బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి తంగళ్లపల్లి ఎస్ఐ లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించగా,అప్పటి డీఎస్పీ చంద్రశేఖర్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారని అన్నారు . విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో 18 మంది సాక్షులను ప్రవేశపెట్టాగా,పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. జాన్సీ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారని,సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడికి శిక్ష విధించారని తెలిపారు .

మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. వేధింపులు లేదా అన్యాయం ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. నేరాలకు పాల్పడిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు .

నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి డీఎస్పీ చంద్రశేఖర్, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్ఐలు లక్ష్మారెడ్డి, అశోక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. జాన్సీ, కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్, కోర్టు సిబ్బంది రాజేందర్, నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ లీగల్ సపోర్ట్ పర్సన్ లహరికలను ఎస్పీ అభినందించారు.

## జర్మనీలో ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**-జిల్లా ఉపాధి అధికారి రజనీ కిరణ్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జర్మనీలో ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ముప్పిడి రజనీ కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రజనీ కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఫిజియోథెరపీలో బీపీటీ లేదా ఎంపీటీ విద్యార్హత కలిగి, 43 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జర్మన్ భాషలో బి–1 స్థాయి అర్హత తప్పనిసరిగా ఉండాలని, ఇటీవల వైద్య చికిత్సా రంగంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని,అనుభవం లేని వారు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

ఎంపికైన వారికి నెలకు సుమారు 2,500 నుంచి 2,900 యూరోల వరకు వేతనం లభిస్తుందని, జర్మన్ వైద్య వృత్తి అనుమతి పొందిన అనంతరం నెలకు 2,800 నుంచి 3,500 యూరోల వరకు వేతనం పొందే అవకాశం ఉంటుందని అన్నారు.యజమాని ద్వారా పూర్తి ఆరోగ్య బీమా, సంవత్సరానికి 25 నుంచి 30 రోజుల వరకు సెలవులు, భవిష్యత్తులో శాశ్వత నివాసం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.జర్మన్ భాషా శిక్షణ, ధ్రువపత్రాల పరిశీలన, ఉద్యోగ నియామక సహాయం, వీసా ప్రక్రియకు సహకారం, జర్మనీకి విమాన ప్రయాణ టికెట్ వంటి సేవలను తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 08035524946 నంబర్‌లో సంప్రదించాలని, తమ విద్యార్హతలు, అనుభవ వివరాలతో కూడిన దరఖాస్తును tomcomglobal@gmail.comకు పంపాలని సూచించారు. జర్మనీలో ఉద్యోగం పొందాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## భూముల రీసర్వే కచ్చితత్వంతో పూర్తి చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,

జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో కచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.భూముల రీసర్వే ప్రక్రియ, భూ భారతి, సాదాబైనామా, ఎస్ ఐ ఆర్, 22 ఏ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు . ముందుగా మండలాల వారిగా భూముల రీ సర్వే ప్రక్రియ, వివిధ అంశాలపై తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. భూముల రీ సర్వేలో భాగంగా భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా సేకరించాలని, లక్ష్యం నిర్దేశించుకుని, రీ సర్వే గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రామాల్లో సర్వే చేసే ముందు ఆయా భూముల సర్వే నంబర్ల వివరాల సమాచారం చేరవేయాలని తెలిపారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో నిత్యం పరిశీలించాలని సూచించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే చేసేప్పుడు రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ భూముల రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పనులను పకడ్బందీగా చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్



## ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం..

బలగం టీవీ,వేములవాడ:

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లెలో ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి రూ.50,016 విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పుర వెంకటరెడ్డి, మిట్టపల్లి అనిల్‌రెడ్డి, విక్కుర్తి సాయిబాబు, వనపర్తి జగన్, విక్కుర్తి నారాయణ, రేగుల రాజేశం, బూర గణేష్, గుడిసె మనోజ్, అప్పవారి చక్రపాణి, నాగుల శంకర్, వనపర్తి గంగయ్య, దేశెట్టి ఆశయ్య, కొప్పుర సంతోష్‌రెడ్డి, నల్ల సతీష్‌రెడ్డి, గుడిసె సదానందం, నల్ల తిరుపతిరెడ్డి, బొడ్డు కిషన్‌తో పాటు గ్రామ కులసంఘాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## తొమ్మిదేళ్లగా పరిహారం ఇవ్వని ప్రభుత్వాలు..!

**- చెరువు కట్టక్రింది భూ యజమానులకు న్యాయం చేయాలి..**

**- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు**

బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:

వేములవాడ పట్టణంలో అభివృద్ధి పేరుతో చెరువు కట్టక్రింది ప్రాంతంలో గెజిట్ నంబర్ G/29/2017 పరిధిలోని సుమారు 20 ఎకరాల 20 గుంటల భూమిని 2017లో భూసేకరణ కింద తీసుకున్నప్పటికీ,ఇప్పటివరకు అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని అదే సమయంలో భూమి యజమానులకు నష్టపరిహారం కూడా చెల్లించలేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు ఆరోపించారు.

ఈ సమస్యపై సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, వైటీడీఏ వైస్ చైర్మన్ లకు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాజన్న ఆలయ అభివృద్ధి కోసం భూసేకరణ జరిగి దాదాపు తొమ్మిది సంవత్సరాలు గడిచినా ప్రభుత్వం భూముల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం,భూ యజమానులకు నష్టపరిహారం అందించకపోవడం వల్ల దాదాపు 200 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ భూముల్లో కొంతమందికి వారసత్వంగా భూములు లభించగా,మరికొందరు తమ పిల్లల వివాహాలు,ఉన్నత విద్య,భవిష్యత్ అవసరాల కోసం భూములను కొనుగోలు చేశారని పేర్కొన్నారు.అయితే భూసేకరణ పేరుతో సంవత్సరాలుగా ఆ భూములపై హక్కులు,వినియోగంపై అనిశ్చితి నెలకొనడంతో పేద,మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూముల్లో అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చినా అవి అమలు కాలేదని సంతోష్ బాబు విమర్శించారు. 2023లో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి భూమి యజమానులకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. గతంలో వేములవాడ బద్ది పోచమ్మ దేవాలయ అభివృద్ధి సందర్భంగా నిర్వాసితులకు ప్యాకేజీ అందించిన విధంగానే చెరువు కట్టక్రింది భూముల యజమానులకు కూడా అదే విధంగా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి తగిన న్యాయం చేయాలని బీజేపీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు రేగుల సంతోష్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ జక్కుల తిరుపతి,పార్టీ నాయకులు మల్లారం తిరుపతి,కోరేపు వెంకటేష్,ఖమ్మం పృథ్వీరాజ్ లతో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నయం చేస్తామన్నారు.. నిండా ముంచేశారు...

**-పూజలు చేస్తే ప్రాణం బాగవుతుందన్నారు..62లక్షలు లాగేశారు..**

**-ఇద్దరి నిందితుల అరెస్ట్..30.50 లక్షల నగదు స్వాధీనం.**

**-ఎస్పీ మహేష్ బి. గితే**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

క్షుద్ర పూజలు, మంత్రాలు, చేతబడుల పేరుతో అనారోగ్యం నయం చేస్తామని ఓ మహిళను నమ్మించి సుమారు రూ.62 లక్షలు వసూలు చేసిన ఇద్దరు నిందితులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, క్షుద్ర పూజలకు ఉపయోగించే బెల్లం బొమ్మలు, పసుపు, కుంకుమతో పాటు ఇతర పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ

శ్యాం కుమార్ హైదరాబాద్‌లోని తూముకుంటలో పూజా సామగ్రి దుకాణం నిర్వహిస్తున్నాడని,శ్యాం కుమార్ వద్దకు వేములవాడ మండలం అగ్రహారానికి చెందిన లక్ష్మీరాజం పూజా సామగ్రి కోసం తరచూ వచ్చేవాడని తెలిపారు.ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడిందని,లక్ష్మీరాజం క్షుద్ర పూజలు, మంత్రాలు, దిష్టి, చేతబడి పేరుతో ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేస్తానని శ్యాం కుమార్‌కు చెప్పాగా,పూజల కోసం వచ్చే వారిని తన వద్దకు పంపిస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఇద్దరూ పంచుకుందామని చెప్పడంతో శ్యాం కుమార్ అంగీకరించాడని అన్నారు.

ఈ క్రమంలో జనవరిలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఓ మహిళ శ్యాం కుమార్ దుకాణానికి పూజా సామగ్రి కోసం రాగ,తాను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, చికిత్స తీసుకున్నా నయం కావడం లేదని అతడికి చెప్పగా,ఆమెకు పూజలపై నమ్మకం ఉందని గుర్తించిన శ్యాం కుమార్ క్షుద్ర పూజల ద్వారా దీర్ఘకాలిక అనారోగ్యాన్ని నయం చేయవచ్చని, అగ్రహారానికి చెందిన లక్ష్మీరాజం చాలా మందికి పూజలు చేసి నయం చేశాడని చెప్పి అతడి వద్దకు తీసుకెళ్లాడని అన్నారు.




ఫిబ్రవరిలో సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద లక్ష్మీరాజంను ఆమెకు పరిచయం చేయగా, ముందస్తు పథకం ప్రకారం లక్ష్మీరాజం కూడా ఆమెను నమ్మించి పూజల కోసం డబ్బులు అవసరమని మొదట రూ.10 లక్షలు నగదు, అనంతరం యాదాద్రి వద్ద రూ.21 లక్షలు, కాశీలో రూ.13 లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. శ్యాం కుమార్ సూచించిన బ్యాంకు ఖాతాలతో పాటు ఇతర ఖాతాలకు విడతల వారీగా సుమారు రూ.62 లక్షలు పంపినట్లు,మరికొంత మొత్తాన్ని పూజల పేరుతో ఆమెతోనే ఖర్చు చేయించినట్లు తెలిపారు.

తర్వాత మోసం విషయం బయటపడుతుందనే భయంతో ఆమెతో తెల్లకాగితాలపై సంతకాలు కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆమె అడగడంతో క్షుద్ర పూజలు, చేతబడి చేసి ఆమెను, కుటుంబ సభ్యులను చంపేస్తామని ఇద్దరూ బెదిరించినట్లు తెలిపారు. ఆమె పొలంలో గుప్త నిధులు ఉన్నాయని, వాటిని వెలికితీసి ఇస్తామని చెప్పి మరికొంతకాలం నమ్మించినట్లు పేర్కొన్నారు .ఈ నెల 23న డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి సిరిసిల్ల పాత బస్టాండ్‌కు రావాలని ఆమెను పిలిపించాగ,ఆమె అక్కడికి వెళ్లగా నిందితులు రాకపోవడంతో సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, అగ్రహారంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

వారి నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, క్షుద్ర పూజలకు ఉపయోగించే బెల్లంతో తయారు చేసిన రెండు బొమ్మలు, పసుపు, కుంకుమ స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనారోగ్య సమస్యలకు క్షుద్ర పూజలు, చేతబడులు, మంత్రాలు పరిష్కారం కాదని ప్రజలు గుర్తించాలని,ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి సరైన చికిత్స పొందాలని అన్నారు.పూజలు, మంత్రాలు, గుప్తనిధులు లేదా మూఢనమ్మకాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసి మోసం చేసేందుకు ప్రయత్నిస్తే నమ్మకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# రూ.1.71 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

**-సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 25 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం**




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల పురపాలక సంఘ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ హాలులో నిర్వహించారు. మొత్తం 25 అంశాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మొత్తం రూ.1.71 కోట్ల పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేశారు.బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్ల కోసం విద్యుత్ దీపాలు, కంకర, యంత్ర పరికరాలు, ట్రాక్టర్ల తదితర పనులకు రూ.29 లక్షలు కేటాయించారు. వివిధ వార్డుల్లో మురుగునీటి కాలువలు, వంతెనలు, బతుకమ్మ వేదికలు తదితర ఎనిమిది పనులకు రూ.59 లక్షలు మంజూరు చేశారు.

అలాగే వివిధ వార్డుల్లో వీధి దీపాల ఏర్పాటుకు రూ.10 లక్షలు, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.21 లక్షలు, మున్సిపల్ కార్యాలయ భవనం ఆధునీకరణ పనులకు రూ.42 లక్షలు మంజూరు చేశారు. విద్యానగర్, నెహ్రూనగర్ వైకుంఠధామాల్లో దహన వేదికల మరమ్మతులు, ఇతర పనులకు రూ.10 లక్షలు కేటాయించారు.

**మాదకద్రవ్యాల నివారణపై అవగాహన**

సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, నివారణ చర్యలపై కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. పట్టణంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సభ్యుల సూచనలు, సలహాలను స్వీకరించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని కౌన్సిలర్లు ప్రతిజ్ఞ చేశారు.ఈ సమావేశంలో వైస్‌చైర్మన్, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్, పట్టణ ప్రణాళిక అధికారులు, సహాయ ఇంజనీర్, జూనియర్ లెక్కల అధికారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఐడీఓసీ ప్రజావాణికి మొత్తం 162 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 4 దరఖాస్తులు, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో 4 దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులకు వాటిని అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**మండలాల్లోనూ ప్రజావాణి**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఐడీఓసీ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



# 32 ఏజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం..

**-పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణాభివృద్ధే లక్ష్యం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**-రూ.94 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు.. 15 వేల మొక్కల పంపిణీకి నిర్ణయం..**




బలగం టీవీ, వేములవాడ:

పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో అధికారులు ప్రవేశపెట్టిన మొత్తం 32 ఏజెండా అంశాలను కౌన్సిలర్లు సమగ్రంగా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు.

సమావేశంలో ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.94 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 15,000 మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా ఈ కార్యక్రమానికి రూ.15 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేశారు.

సమావేశం అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు విలేకరులతో మాట్లాడుతూ, రాజకీయాలు, పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణ అభివృద్ధే తమ కౌన్సిల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, మార్గదర్శకత్వంతో మున్సిపాలిటీకి అవసరమైన ప్రత్యేక నిధులను సమకూర్చుకుంటూ అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నామని చెప్పారు.

పట్టణంలో రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు తదితర ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.

ప్రతి వార్డులో డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ వంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

అదేవిధంగా రాత్రివేళల్లో వీధి దీపాల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అందుబాటులో ఉండాలని చైర్మన్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

**సోషల్ మీడియా వేదికగా నిష్క్రమణ ప్రకటన**
**తండ్రి మరణం, వరల్డ్ కప్ ఓటమితో సంచలన నిర్ణయం.. విలపిస్తున్న ఫుట్‌బాల్ ప్రపంచం**



బలగం టీవీ, హైదరాబాద్

అంతిమంగా ఆ చారిత్రక అధ్యాయం ముగిసింది! సుదీర్ఘంగా రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా నీలి-తెలుపు జెర్సీలో అభిమానులను అలరించిన సాకర్ లెజెండ్, దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సోషల్ మీడియా వేదికగా బాంబు పేల్చాడు. స్పెయిన్‌తో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ ఓటమి ఎదురైన రెండు రోజులకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు, ఇటీవలే తన తండ్రి మరణించడంతో మనస్తాపానికి గురై ఈ బాట పట్టినట్లు మెస్సీ వెల్లడించాడు. 39 ఏళ్ల మెస్సీ తన నిర్ణయంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర విషాదంలో ముంచెత్తాడు.

'ఇక నాలో ఏమీ మిగలలేదు':

రిటైర్మెంట్ ప్రకటన సందర్భంగా మెస్సీ అత్యంత భావోద్వేగానికి గురయ్యాడు. "ఇది నాకు ఎంతో బాధాకరమైన నిర్ణయం. దేశం కోసం ఆడటానికి నా శక్తివంచన లేకుండా శ్రమించాను. గత కొన్ని ఏళ్లలో సాధించిన విజయాలే కాకుండా, అంతకుముందు ఎదురైన ఓటముల్లోనూ దేశం కోసం నా సర్వస్వం ధారపోశాను. కానీ, ఇప్పుడు జట్టుకు అందించడానికి నా దగ్గర ఇంకేమీ మిగలలేదు. యువ రహిత ప్రతిభావంతులకు అవకాశం ఇచ్చేందుకు ఇదే సరైన సమయం. జులై 21నే ఈ నిర్ణయం తీసుకున్నాను, తండ్రి మరణం తర్వాత మరింత స్పష్టత వచ్చింది. ఇకపై ఒక సాధారణ అభిమానిగా జట్టును ప్రోత్సహిస్తాను" అని మెస్సీ పేర్కొన్నాడు. అయితే అమెరికాలోని ఇంటర్ మైయామి క్లబ్ తరఫున లీగ్ మ్యాచ్‌లు మాత్రం కొనసాగిస్తానని స్పష్టం చేశాడు.

సరిసాటి లేని సుదీర్ఘ ప్రయాణం:

2005లో 18 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మెస్సీ, అర్జెంటీనా తరఫున అత్యధికంగా 207 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించి 125 గోల్స్‌తో ఆల్-టైమ్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 2014 ప్రపంచ కప్ ఫైనల్, వరుస కోపా అమెరికా ఫైనల్స్ ఓటముల తర్వాత 2016లో ఒకసారి రిటైర్మెంట్ ప్రకటించి, మళ్లీ వెనక్కి తగ్గడం విదితమే. ఆ తర్వాత 2021లో కోపా అమెరికా టైటిల్ సాధించి అర్జెంటీనా దశాబ్దాల కరవును తీర్చిన మెస్సీ, 2022 ఖతార్ వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శనతో (7 గోల్స్) అర్జెంటీనాను విశ్వవిజేతగా నిలిపి తన కెరీర్‌ను సంపూర్ణం చేసుకున్నాడు.

మెస్సీ అంతర్జాతీయ కెరీర్ ముఖ్యాంశాలు:

మొత్తం మ్యాచ్‌లు: 207

చేసిన గోల్స్: 125 (అర్జెంటీనా తరఫున ఆల్‌టైమ్ రికార్డు)

ప్రధాన టైటిళ్లు: ఫిఫా ప్రపంచ కప్ (2022), కోపా అమెరికా (2021)

అవార్డులు: వరల్డ్ కప్ గోల్డెన్ బాల్ (2022)

# కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిసిన తిలక్ వర్మ

**కష్టాల్లో ఉన్న సౌత్‌జోన్‌ను ఆదుకున్న 'తెలుగు తేజం' సెంచరీ**
**శ్రేయస్ గోపాల్‌తో కలసి భారీ భాగస్వామ్యం..**
**నార్త్ జోన్‌పై 90 పరుగుల ఆధిక్యం**
**దులీప్ ట్రోఫీ సెమీస్:**



బలగం టీవీ, హైదరాబాద్

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మ అద్భుత శతకంతో చెలరేగాడు. బ్యాటింగ్‌కు తీవ్రంగా సహకరించని కఠినమైన వికెట్‌పై కెప్టెన్ ఇన్నింగ్స్‌తో సౌత్‌జోన్ జట్టును ఆదుకున్నాడు. నార్త్ జోన్‌తో జరుగుతున్న ఈ కీలక పోరులో తిలక్ వర్మ (225 బంతుల్లో 7 ఫోర్లతో 106 నాటౌట్) అజేయ సెంచరీతో సత్తా చాటడంతో, రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 94 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. ప్రస్తుతం సౌత్‌జోన్ 90 పరుగుల విలువైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలో నిలిచింది.

**ఒత్తిడిలో 'క్లాస్' బ్యాటింగ్:**

ఒకానొక దశలో సౌత్‌జోన్ కేవలం 80 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ప్రత్యర్థి బౌలర్లు నిప్పులు చెరుగుతున్న వేళ, కెప్టెన్ తిలక్ వర్మ అత్యంత బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేశాడు. అతనికి శ్రేయస్ గోపాల్ (169 బంతుల్లో 11 ఫోర్లతో 87) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు ఏకంగా 175 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును సురక్షిత తీరానికి చేర్చారు. సెంచరీకి చేరువలో శ్రేయస్ గోపాల్ అవుటైనప్పటికీ, తిలక్ వర్మ టెయిలెండర్ల సాయంతో తన సెంచరీని పూర్తి చేసుకుని అజేయంగా నిలిచాడు. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్ (4/70) నాలుగు వికెట్లతో రాణించగా, అర్షదీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్ చెరో రెండు వికెట్లు తీశారు.

**నార్త్ జోన్ 195 ఆలౌట్:**

అంతకుముందు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ జోన్, సౌత్ జోన్ బౌలర్ల ధాటికి 59.1 ఓవర్లలో 195 పరుగులకే కుప్పకూలింది. నార్త్ జోన్ బ్యాటర్లలో ఖమ్రాన్ ఇక్బాల్ (182 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 76) ఒక్కడే అర్ధశతకంతో పోరాడగా, కన్హయ వధవాన్ (35) కాసేపు నిలదొక్కుకున్నాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సౌత్ జోన్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప (4/64) నిలకడగా బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టగా, నిదీష్ (2/36), తనయ్ త్యాగరాజన్ (2/31) రెండేసి వికెట్లు దక్కించుకున్నారు. కావురి సాయితేజ, శ్రేయాస్ గోపాల్‌లకు తలో వికెట్ లభించింది.

**సంక్షిప్త స్కోర్లు:**

నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్: 195 ఆలౌట్ (ఖమ్రాన్ ఇక్బాల్ 76, కన్హయ 35; విద్వత్ కావేరప్ప 4/64, నిదీష్ 2/36, తనయ్ 2/31).

సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్: 285/9 (తిలక్ వర్మ 106 బ్యాటింగ్, శ్రేయస్ గోపాల్ 87; గుర్నూర్ బ్రార్ 4/70, అర్షదీప్ సింగ్ 2/43).

# రెండో ఇన్నింగ్స్‌లో కష్టాల్లో సెంట్రల్ జోన్



బలగం టీవీ, హైదరాబాద్

దులీప్ ట్రోఫీ సెమీఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ సంచలన యంగ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ (81 బంతుల్లో 92; 8 ఫోర్లు, 7 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. పవర్ ఫుల్ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన 15 ఏళ్ల వైభవ్.. అతి పిన్న వయసులోనే దులీప్ ట్రోఫీలో అర్ధశతకం సాధించిన ఆటగాడిగా అవతరించి, 57 ఏళ్ల నాటి చారిత్రక రికార్డును చెరిపివేశాడు. 1969లో లక్ష్మణ్ సింగ్ (16 ఏళ్ల 23 రోజులు) పేరిట ఉన్న రికార్డును ఈ బీహార్ కుర్రాడు దాటేశాడు. అయితే, దురదృష్టవశాత్తు కేవలం 8 పరుగుల వ్యవధిలో తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు.

వైభవ్ సూర్యవంశీ, అభిమన్యు ఈశ్వరన్ (69) ల మధ్య మొదటి వికెట్‌కు 161 పరుగుల భాగస్వామ్యం లభించడంతో ఈస్ట్ జోన్ భారీ ఆధిక్యం సాధించేలా కనిపించింది. అయితే, హర్ష్ దూబే (4/66), యశ్ ఠాకూర్ (3/66), ఆర్యన్ పాండే (3/43) ధాటికి ఈస్ట్ జోన్ అనూహ్యంగా కుప్పకూలింది. కేవలం 105 పరుగుల వ్యవధిలోనే ఆ జట్టు 10 వికెట్లు కోల్పోయి, 266 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. గాయం నుంచి కోలుకుని మైదానంలోకి వచ్చిన కెప్టెన్ ఇషాన్ కిషన్ కూడా నిరాశపరిచాడు. దీంతో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ స్కోరు (266)ను ఈస్ట్ జోన్ సమం చేయడమే తప్ప ఆధిక్యం సాధించలేకపోయింది.

**రెండో ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ తడబాటు:**

రెండో రోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తన రెండో ఇన్నింగ్స్‌లో 45 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రోజు ఆఖరి నిమిషాల్లో ఈస్ట్ జోన్ పేసర్ ముకేష్ కుమార్.. సెంట్రల్ జోన్ కెప్టెన్ రజత్ పటీదార్‌ను అవుట్ చేసి భారీ దెబ్బతీశాడు. ప్రస్తుతం క్రీజులో అమన్ మోఖడే (23 నాటౌట్), ఆర్యన్ పాండే (4 నాటౌట్) ఉన్నారు.

సంక్షిప్త స్కోర్లు:

సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్: 266 ఆలౌట్.

ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్: 266 ఆలౌట్ (వైభవ్ సూర్యవంశీ 92, అభిమన్యు ఈశ్వరన్ 69; హర్ష్ దూబే 4/66, ఆర్యన్ పాండే 3/43, యశ్ ఠాకూర్ 3/66).

సెంట్రల్ జోన్ రెండో ఇన్నింగ్స్ (రెండో రోజు ముగిసేసరికి): 45/3 (అమన్ మోఖడే 23 నాటౌట్; ముకేష్ కుమార్ 1/12).

# ఇంగ్లండ్ చేతిలో పాక్ చిత్తు.. సిరీస్ కోల్పోయిన పాకిస్థాన్

**లార్డ్స్ టెస్టులో 194 పరుగుల ఘోర పరాజయం**
**0–2తో సిరీస్ చేజార్చుకున్న పాక్**
**రిజ్వాన్, ఇమామ్‌పై వేటుకు పీసీబీ నిర్ణయం?**



బలగం టీవీ, హైదరాబాద్

ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. మూడు టెస్టుల సిరీస్‌లో వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసిన పాకిస్థాన్.. సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 0–2తో కోల్పోయింది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఓడిన పాక్.. తాజాగా లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది.

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అట్టడుగున

ఇంగ్లండ్‌తో వరుస పరాజయాల కారణంగా పాకిస్థాన్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. పాకిస్థాన్‌తో పాటు ఇంగ్లండ్ కూడా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశాలను కోల్పోయిన పరిస్థితి నెలకొంది.

రిజ్వాన్, ఇమామ్‌లపై వేటు?

వరుస పరాజయాలతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. వికెట్ కీపర్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్‌ను జట్టు నుంచి తప్పించి స్వదేశానికి పంపించాలని నిర్ణయించినట్లు జియో న్యూస్ పేర్కొంది. ఈ పరిణామాలపై పీసీబీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలిపింది.

టెస్టు కోచ్ సర్ఫరాజ్‌కు ఉద్వాసన?

వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ టెస్టు జట్టు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌పై కూడా వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో పరిమిత ఓవర్ల జట్టు కోచ్ మైక్ హెస్సెన్‌కు టెస్టు జట్టు బాధ్యతలు అప్పగించే యోచనలో పీసీబీ ఉన్నట్లు సమాచారం. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే మూడో టెస్టుకు ముందే దీనిపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని జియో న్యూస్ పేర్కొంది.

ఇమామ్ స్థానంలో అబ్దుల్లా ఫజల్

ఇమామ్ ఉల్ హక్‌ను తప్పిస్తే అతని స్థానంలో అబ్దుల్లా ఫజల్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు పీసీబీ వర్గాలు తెలిపాయి. ఇంగ్లండ్ పర్యటనలో జట్టు పేలవ ప్రదర్శన, ముఖ్యంగా బ్యాటింగ్ వైఫల్యంపై బోర్డు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



# యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం

**తొలి రౌండ్‌లోనే జోకోవిచ్ అవుట్**
**అర్జెంటీనా ప్లేయర్ నవోని చేతిలో పరాజయం.. 25వ గ్రాండ్ స్లామ్ కల భగ్నం**
**కన్నీళ్లు పెట్టుకున్న 24 గ్రాండ్ స్లామ్‌ల విజేత.. 2006 తర్వాత ఇదే తొలిసారి**

బలగం టీవీ, హైదరాబాద్

వయసు మీదపడుతున్నా మైదానంలో శక్తినంతా ధారపోసి తీవ్రంగా శ్రమించాడు.. కానీ ఫలితం దక్కలేదు. ఓటమిని అడ్డుకోలేకపోయిన ఆ టెన్నిస్ దిగ్గజం, భావోద్వేగాన్ని ఆపుకోలేక మైదానంలోనే కన్నీటిపర్యంతమయ్యాడు. యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలో 24 గ్రాండ్ స్లామ్‌ల విజేత, 4వ సీడ్ నోవాక్ జోకోవిచ్ (సెర్బియా) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించి షాక్ ఇచ్చాడు. తీవ్రంగా సాగిన ఐదు సెట్ల పోరులో అర్జెంటీనా ఆటగాడు మారియానో నవోని చేతిలో 7-6 (5), 5-7, 4-6, 6-2, 6-1 తేడాతో జోకోవిచ్ తీవ్ర పరాజయాన్ని చవిచూశాడు. ఈ ఓటమితో అతని 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్ కల ఆదిలోనే కల్లలైంది.

4 గంటల 36 నిమిషాల సమరం:

39 ఏళ్ల వయసులోనూ జోకోవిచ్ ఆఖరి వరకు పోరాటపటిమ ప్రదర్శించాడు. సుమారు 4 గంటల 36 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరు, జోకోవిచ్ కెరీర్‌లోనే అత్యధిక సమయం తీసుకున్న తొలి రౌండ్ మ్యాచ్‌గా నిలిచింది. మ్యాచ్ మధ్యలో తీవ్ర అస్వస్థతకు గురైన జోకోవిచ్, ఓ దశలో కోర్టు పక్కన టవల్‌లోనే వాంతి (కక్కేశాడు) చేసుకున్నాడు. మెడికల్ డాక్టర్ ఇచ్చిన పిల్స్ వేసుకోవడంతో పాటు 4, 5 సెట్ల మధ్య మెడికల్ టైమ్‌అవుట్ కూడా తీసుకున్నాడు. అయితే, మ్యాచ్ వ్యాప్తంగా జోకోవిచ్ ఏకంగా 70 అనవసర తప్పిదాలు (అన్‌ఫోర్స్డ్ ఎర్రర్స్) చేయడం అతనికి తీవ్ర నష్టం కలిగించింది.

చారిత్రక నిష్క్రమణ:

జోకోవిచ్ యూఎస్ ఓపెన్ చరిత్రలోనే తొలి రౌండ్‌లో నిష్క్రమించడం ఇదే మొదటిసారి. అంతేకాకుండా, ఏ గ్రాండ్ స్లామ్ టోర్నీలోనైనా అతడు తొలి రౌండ్‌లోనే ఓడిపోవడం 2006 తర్వాత (20 ఏళ్ల తర్వాత) మళ్లీ ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రపంచ నెంబర్ వన్ జాన్నిక్ సిన్నర్ గాయంతో దూరమవ్వడం, కార్లోస్ అల్కరాజ్ కూడా సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగడంతో ఈసారి టైటిల్ నెగ్గేందుకు జోకోవిచ్‌కు సువర్ణావకాశం లభించింది. కానీ తొలి పోరులోనే ఘోర పరాజయం ఎదురైంది. మ్యాచ్ ముగిసిన అనంతరం జోకోవిచ్ మాట్లాడుతూ.. ఈ ఓటమిని తట్టుకోలేకే మానసికంగా తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నట్లు వెల్లడించాడు.

స్కోరు వివరాలు:

మారియానో నవోని (అర్జెంటీనా) విజయం నోవాక్ జోకోవిచ్ (సెర్బియా) పై.

స్కోరు: 6-7 (5), 7-5, 6-4, 2-6, 1-6.

# దులీప్ ట్రోఫీలో వైభవ్ సూర్యవంశీ సంచలనం

**57 ఏళ్ల నాటి చారిత్రక రికార్డు బద్దలు**
**అతి చిన్న వయసులోనే హాఫ్ సెంచరీ సాధించిన క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు**



బలగం టీవీ, హైదరాబాద్

దులీప్ ట్రోఫీ టోర్నీలో బీహార్‌కు చెందిన సంచలన యంగ్ క్రికెటర్, 'చిచ్చరపిడుగు' వైభవ్ సూర్యవంశీ అరుదైన మైలురాయిని అందుకుని చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున ఆడుతున్న ఈ యంగ్ ఓపెనర్.. అత్యంత పిన్న వయసులోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన క్రికెటర్‌గా అవతరించి, ఏకంగా 57 ఏళ్ల నాటి చారిత్రక రికార్డును చెరిపివేశాడు.

ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య జరుగుతున్న సెమీఫైనల్ పోరులో వైభవ్ కేవలం 42 బంతుల్లోనే ధనాధన్ అర్ధశతకాన్ని బాదాడు. ఆ తర్వాత కూడా తన విధ్వంసకర బ్యాటింగ్‌ను కొనసాగించి, కేవలం కొన్ని పరుగుల వ్యవధిలో సెంచరీ చేజార్చుకుని 92 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయం కారణంగా జట్టుకు దూరం కావడంతో, ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ నాయకత్వ బాధ్యతలు కూడా నిర్వర్తించడం విశేషం.

లక్ష్మణ్ సింగ్ ఆల్‌టైమ్ రికార్డు కనుమరుగు:

వైభవ్ సూర్యవంశీ కేవలం 15 ఏళ్ల 157 రోజుల వయసులోనే దులీప్ ట్రోఫీలో ఫిఫ్టీ నమోదు చేసి ఈ ఆల్‌టైమ్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. అంతకుముందు 1969లో (57 ఏళ్ల క్రితం) లక్ష్మణ్ సింగ్ 16 ఏళ్ల 23 రోజుల వయసులో హాఫ్ సెంచరీ సాధించి నమోదు చేసిన రికార్డే ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉంది. తాజాగా ఆ రికార్డును వైభవ్ తుడిచిపెట్టేశాడు.

# తొలి రౌండ్‌లోనే వీనస్ విలియమ్స్ నిష్క్రమణ

**సొంతదేశ ఆటగాడు సోఫియా కెనిన్ చేతిలో ఓటమి**
**26వ సారి టోర్నీలో ఆడి రికార్డు..**
**సింగిల్స్‌లో వరుసగా 15వ పరాజయం**



బలగం టీవీ, హైదరాబాద్

ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను ఏలిన దిగ్గజ ఆటగాళ్లకు కాలంతో పాటు ఫామ్ లేమి కూడా సవాలుగా మారుతోంది. అమెరికా టెన్నిస్ లెజెండ్ వీనస్ విలియమ్స్ మరోసారి గ్రాండ్ స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లోనే ఓటమి పాలై నిరాశపరిచింది. గ్రాండ్ స్లామ్ రికార్డు స్థాయిలో 26వ సారి యూఎస్ ఓపెన్ టోర్నీలో బరిలోకి దిగిన ఈ 46 ఏళ్ల వెటరన్ స్టార్.. ఉదయం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సొంతదేశానికే చెందిన సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో పరాజయం పాలైంది. ఈ ఓటమితో సింగిల్స్ విభాగంలో వీనస్‌కు వరుసగా ఇది 15వ పరాజయం కావడం గమనార్హం.

చేజారిన రెండో సెట్:

వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఈ టోర్నీలోకి అడుగుపెట్టిన వీనస్ విలియమ్స్.. తొలి సెట్‌లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. సోఫియా దాటికి తొలి సెట్‌ను 2-6తో సులభంగా కోల్పోయింది. అయితే, రెండో సెట్‌లో పుంజుకుని ఆకట్టుకునే పోరాటపటిమను ప్రదర్శించింది. చివరకు హోరాహోరీగా సాగిన ఈ సెట్‌లో ఒక్క పాయింట్ తేడాతో వెనుకబడి సెట్‌తో పాటు మ్యాచ్‌ను కెనిన్‌కు సమర్పించుకుంది. ఇటీవల సిన్సినాటి ఓపెన్‌లో తన సోదరి సెరీనా విలియమ్స్‌తో కలిసి డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన వీనస్‌కు.. ఈ ఓటమి మరో తీవ్ర నిరాశను మిగిల్చింది.

డబుల్స్‌పైనే ఆశలు:

గతేడాది (2025) యూఎస్ ఓపెన్‌లో చివరిసారిగా సింగిల్స్ మ్యాచ్‌లో విజయం సాధించిన వీనస్, ఆ తర్వాత ఫామ్ లేమితో తీవ్రంగా సతమతమవుతోంది. సింగిల్స్ టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ.. ఈ టోర్నీలో తన సోదరి సెరీనా విలియమ్స్‌తో కలిసి డబుల్స్ విభాగంలో పోటీపడేందుకు వీనస్ సిద్ధమవుతోంది.

స్కోరు వివరాలు:

సోఫియా కెనిన్ (అమెరికా) విజయం వీనస్ విలియమ్స్ (అమెరికా) పై.

స్కోరు: 6-2, 7-5.

# శ్రీలంకకు ఐసీసీ షాక్: మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం రద్దు

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంక క్రికెట్ బోర్డుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఊహించని షాక్ ఇచ్చింది. 2027లో శ్రీలంక వేదికగా జరగాల్సిన తొలి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను ఆ దేశం నుంచి ఐసీసీ రద్దు చేసింది. ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరగాల్సిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఇకపై శ్రీలంక గడ్డపై జరగదని స్పష్టం చేసింది. బోర్డు వ్యవహారాల్లో శ్రీలంక ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడమే ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఏ దేశ ప్రభుత్వమూ స్వతంత్ర క్రికెట్ బోర్డుపై నియంత్రణ కలిగి ఉండకూడదు.

ఎన్నికలు జరపకపోవడమే శాపం:

ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీలంక ప్రభుత్వం బోర్డును తన ఆధీనంలోకి తీసుకుని, తాత్కాలికంగా కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు ఒక పరివర్తన (ట్రాన్స్‌ఫర్మేషన్) కమిటీని ఏర్పాటు చేసింది. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యయుతంగా స్వతంత్ర బోర్డును ఏర్పాటు చేయాలని ఐసీసీ పలుమార్లు ఆదేశించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఐసీసీ టోర్నీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ కార్యదర్శి ప్రకాష్ షఫ్తార్ ధ్రువీకరించారు. టోర్నీని వేరే చోటకు తరలించారని, కొత్త వేదికను త్వరలోనే నిర్ణయిస్తారని తెలిపారు.ఆరు జట్లు పాల్గొనే ఈ టోర్నీకి తదుపరి ఆతిథ్యమిచ్చే దేశాన్ని ఐసీసీ తదుపరి బోర్డు సమావేశంలో నిర్ణయించనుంది. కాగా, ఆతిథ్య హోదాలో టోర్నీకి నేరుగా అర్హత సాధించాల్సిన శ్రీలంక మహిళల జట్టు భాగస్వామ్యం ఇప్పుడు ప్రమాదంలో పడింది.

# CINEMA

## క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ



### సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

## షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక



షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.

## శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం




వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.

## విడుదలకు రెడీ అవుతున్న సర్దార్-2




కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'సర్దార్ 2' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో ఏజెంట్‌గా కార్తీ చేసిన యాక్షన్, డిఫరెంట్ గెటప్‌లు ప్రేక్షకులను మెప్పించడంతో.. సీక్వెల్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సర్దార్ 2'కు సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్, ఆడియోను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో కార్తీ అభిమానుల్లో సందడి మొదలైంది. 'సర్దార్ 2'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. ఇప్పుడు తెలుగు ట్రైలర్ విడుదల కానుండటంతో సినిమాకు సంబంధించిన కథ, కార్తీ పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, విలన్ క్యారెక్టర్‌పై మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీ ఏజెంట్ పాత్రకు మంచి స్పందన రావడంతో.. రెండో భాగంలో ఆ పాత్రను దర్శకుడు ఏ స్థాయిలో చూపించారనే విషయంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై బజ్ మరింత పెరుగుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'సర్దార్'లో కార్తీ విభిన్న గెటప్‌లలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఏజెంట్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు అదే పాత్రను కొనసాగిస్తూ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సీక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా ఉండబోతుందని, యాక్షన్‌తో పాటు స్పై థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రలో విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య నటిస్తున్నారు. ఆయనకు ఉన్న ప్రత్యేకమైన నటన శైలికి తగ్గట్టుగా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం.కార్తీ, ఎస్‌జే సూర్య మధ్య జరిగే పోరాటం సినిమాకు కీలకంగా ఉండబోతుందని టాక్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ట్రైలర్‌లో విలన్ పాత్రను ఎంతవరకు రివీల్ చేస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.'సర్దార్ 2'లో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కార్తీతో ఆమె కాంబినేషన్ సినిమాకు మరో ఆకర్షణగా నిలవనుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు సినిమాలో ఎమోషనల్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



## కిరణ్ అబ్బవరం మూవీకి హతః టైటిల్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

ఇరుముడి కట్టు వీడగియో సాంగ్ విడుదల చేసిన మేకర్స్ మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్స్‌నే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలిస్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై-వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా మాలధారుల డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ బీట్స్ పాటకు మరింత జోష్‌ను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. 'ఇరుముడి'లో ఈ పాటతో పాటు 'విల్లాలి వీరుడు', 'మల్లెపూల పల్లకి' వంటి భక్తి గీతాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.




